

నంద్యాలకు మరో జాతీయ రహదారి

- తగ్గనున్న ప్రయాణ దూరం
- కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి
- పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం
- నూతన రహదారి ప్రకటనతో జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహం

నంద్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు మరో జాతీయ రహదారి రానుంది. నంద్యాల వయా ఆత్మకూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే విధంగా 170 కిలోమీటర్లు కలిగిన 167 కే జాతీయ రహదారి రూపుదిద్దుకుంది. ఈ రోడ్డు పూర్తయితే సుమారు 70 కిలోమీటర్ల మేర ప్రయాణం తగ్గనుంది. పైగా మధ్యలో అత్యాధునిక హంగులతో క్రిష్ణా నదిపై ఐకానిక్ తీగల వంతెన ఏర్పాటు చేయడం మరింత ఆకర్షణీయంగా ఉండనుంది. మరీ ప్రధానంగా సంగమేశ్వరం మరింత పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న హైదరాబాద్- నంద్యాల జాతీయ రహదారి నిర్మాణ పనులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ నుంచి వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల కల నేటితో సాకారం కానుందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎంతో మేలు

నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 167కే రహదారి నిర్మాణం త్వరగా పూర్తయితే వెలుగోడు మండల ప్రజలకు ఎంతో మేలు. దూరంగా తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా కానుంది. వ్యాపారాలు పెరుగుతాయి. వెలుగోడులో జలాశయం ఉండటంతో పర్యాటకంగా కూడా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముఖ్యంగా నిరుపేదలకు ఉపాధి కలిగే అవకాశం కూడా ఉంటుంది.
- జెండా ఫయాజ్, వెలుగోడు

తగ్గనున్న ప్రయాణ దూరం..

నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లి, నంద్యాల తదితర ప్రాంతాలకు చెందిన వారందరూ హైదరాబాద్‌కు వెళ్లాలంటే ప్రయాణ భారం ఎక్కువగా ఉండేది. తాజా 167కే జాతీయ రహదారితో సుమారు 70 కిలోమీటర్లు దూరం తగ్గనుంది. వాణిజ్య, పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.




ఐకానిక్ బ్రిడ్జి (ఊహా చిత్రం)

రూ. 607 కోట్లతో పనులు


నంద్యాల జిల్లాలోని సంగమేశ్వరం-నల్లకాలువ వయా ఆత్మకూరు, వెలుగోడు -నంద్యాల రోడ్డు వరకు 62 కిలోమీటర్లు (10 మీటర్ల బీటీ రోడ్డు) రెండు వరుసల జాతీయ రహదారి నిర్మిస్తారు. రూ.607 కోట్లతో ఈ పనులు పూర్తి చేయనున్నారు. రూ. 1082.56 కోట్లతో 900 మీటర్లు క్రిష్ణా నదిపై ఐకానిక్ తీగల వంతెనను నిర్మిస్తారు. ఈ బ్రిడ్జి కనుక పూర్తయితే సంగమేశ్వరం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఒకవైపు నల్లమల అడవులు, మరో వైపు కృష్ణమ్మ పరవళ్ల మధ్యలో ఐకానిక్ బ్రిడ్జి తీగలతో ఈ ప్రాంతం సుందరంగా మారనుంది. ఇదే క్రమంలో భూముల విలువలు పెరగనున్నాయి.

79 కిలోమీటర్లు.. రూ. 1300 కోట్లు

వేంపల్లి నుంచి చాగలమర్రి, ప్రొద్దుటూరు మీదుగా రూ.1300 కోట్లతో 79 కిలోమీటర్లు రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డును కూడా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ నుంచి ప్రారంభించారు. బెంగళూరు, విజయవాడ, వయా కడప జాతీయ రహదారికి ఈ రోడ్డు లింకు కలుస్తుంది. ఈ రోడ్డు కూడా వేంపల్లి, కడప జిల్లా వాసులకు మరింత కలిసివస్తుంది. చాగలమర్రి వాసులకు బెంగళూరు వెళ్లేందుకు మరింత సులభతరంగా మారనుంది.



విస్తరణ చేసే సంగమేశ్వరం- వెలుగోడు రోడ్డు ఇదే ..



ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు చేసే కృష్ణా నది ప్రాంతం



ఐకానిక్ వంతెన త్వరగా పూర్తి చేస్తే మంచిది

ఐకానిక్ వంతెన త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. ఈ వంతెన పూర్తయితే రాకపోకలు పెరిగి మాకు ఎంతో ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందవచ్చు.
- సుధాకర్, జానాల గూడెం, కొత్తపల్లి మండలం

బీసీలకు రుణాలివ్వండి

బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ రాజకుమారి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బీసీల స్వయం సమృద్ధి రుణాల మంజూరుపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీ, ఈబీసీ వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను సూచించారు. జిల్లాలో 2156 మంది బీసీలకు 45.84 కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద రుణాలను అందించాలన్నారు. అలాగే ఈబీసీ వర్గాల 73 యూనిట్లకు 1.27 కోట్లు, కమ్మ కార్పొరేషన్ కింద 15 యూనిట్లకు రూ. 26 లక్షలు, రెడ్డి కార్పొరేషన్ కింద 45 యూనిట్లకు రూ. 75 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 26 యూనిట్లకు 45లక్షలు, బ్రాహ్మణ్ కార్పొరేషన్ కింద 10 యూనిట్లకు 17 లక్షల మేర స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రుణాల మంజూరులో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా లబ్ధిదారులకే మంజూరు చేసేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. 21 నుండి 60 సంవత్సరాలలోపు ఉన్న బీసీ వర్గాల వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్ ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్లో ఈనెల 16వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, ఎల్డీఎం రవీంద్రకుమార్, యూబీఐ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సురేంద్రగౌడ్, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మనోహర్, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ సుందరరాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- ఉదయం నుంచే ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించిన ఉలేమాలు
- నేటితో ముగియనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా

6

దొంగ దొరికాడు

అర్ధరాత్రి హైదరాబాద్‌లో పట్టుకున్న పోలీసులు

7

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం

సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను పరిశీలించనున్న పవన్ కల్యాణ్



కర్నూలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఓర్వకల్లు మండలంలో నిర్మించిన సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఆయన పరిశీలిస్తారు. ఉదయం 11 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలదేరి 11.45 గంటలకు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకుంటారు. ప్రత్యేక హెలకాప్టర్ ద్వారా ఓర్వకల్లు, గని సోలార్ విద్యుత్ ప్రాజెక్టు సహా పిన్నాపురం, గుమ్మటంతాండ గ్రామాల మధ్య నిర్మించిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుదుత్పత్తి లక్ష్యంగా సోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజీ) విద్యుత్ సబంధించిన ఇంటిగ్రేటెట్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్‌ఈపీ) నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల్లో 4,750 ఎకరాల భూములు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి టీఎంసీ నీటిని కేటాయించారు. ప్రాజెక్టు రూ.15 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యం. వైసీపీ ఆయాంలో పనులు మందగించినా.. టీడీపీ కూటమి వచ్చాక వేగం పుంజుకుంది. ఈ ఏడాది మార్చిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించేందుకు గ్రీన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలనకు రావడం కొసమెరుపు. ఏరియల్ వ్యూ తరువాత మధ్యాహ్నం 12.30 గంటలకు అప్పర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 1.25 గంటలకు పవర్ హౌస్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 1.45 గంటలకు టీఆర్సీ వ్యూ పాయింట్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 2.15 గంటలకు అతిథి గృహానికి చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 4.05 గంటల వరకు దేశంలోనే ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టు గురించి సబంధిత అధికారులు ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా 4.50 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

స్వచ్ఛ శ్రీశైలం

- క్షేత్ర పరిధిలో విస్తృత పారిశుధ్య చర్యలు
- అవగాహన ర్యాలీ

శ్రీశైలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో బుధవారం పారిశుధ్య స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించింది. కార్యక్రమంలో ప్రధాన ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద నుంచి నందిగుడి వరకు "స్వచ్ఛ శ్రీశైలం" పారిశుధ్య స్వచ్ఛసేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణకై క్షేత్రపరిధిని 6 జోన్లు, 66 ప్రదేశాలుగా విభజించి, ప్రతి జోను పర్యవేక్షణకై దేవస్థానం యూనిట్ అధికారులు, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. కార్యక్రమంలో దేవస్థానం అన్ని విభాగాల సిబ్బంది, శివసేవకులు, స్థానికులను భాగస్వామ్యులను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన రహదారులు, ఆలయ మాడ వీధులు, క్యూకాంప్లెక్స్, అన్నదానం, వసతి భవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, పాతాళగంగ ఘాట్, ఆరోగ్యకేంద్రాలు, సాక్షిగణపతి, హఠకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయ ప్రాంగణం తదితర 66 ప్రదేశాలలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.



స్వచ్ఛ శ్రీశైలంర్యాలీలో పాల్గొన్న దేవస్థానం సిబ్బంది, శివసేవకులు, స్థానికులు



పరిసరాలను శుభ్రంచేస్తున్న సిబ్బంది

కందికి తుఫాను తాకిడి

కొలిమిగుండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది పంట రైతులకు అందలేదు. ఇటీవల వరుస తుఫాన్లు వారి ఆశలను ఆవిరి చేశాయి. పూత రాలి పోయి, పిందె కుళ్లి పోయి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అరకొర దిగుబడికి కూడా మార్కెట్లో గిట్టుబాటు ధర రాలేదు.

- రాలిపోయిన పూత, పిందె
- తగ్గిన దిగుబడులు.. గిట్టుబాటు లేని ధరలు
- జిల్లాలో సాధారణ సాగుకు మించి సాగు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

గతంలో ఎన్నడూలేని విధంగా ఈఏడాది జిల్లాలో కంది సాగైంది. జిల్లాలో 43వేల హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగుకు మించిపోయింది. నంద్యాల జిల్లాలోని 29మండలాల్లో కంది సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 37,545 హెక్టార్లు కాగా 43వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు కంది పంటను సాగు చేశారు. గడచిన పదేళ్లలో కంది సాధారణ సాగును మించి సాగు చేయడం ఈఏడాదేనని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. 50రోజుల క్రితం కంది పంట ఏపుగా పెరిగి, పూత, పిందెతో కళ కళలాడింది. ఎకరాకు 7నుండి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆనందపడ్డారు. అయితే డిసెంబరు మాసంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వరుస తుఫాన్లు కంది రైతుల ఆశలపై నీళ్లుచల్లాయి. కంది పూత మొత్తం రాలిపోగా, పిందె తెగుళ్లతో కుళ్లిపోయింది. దీంతో దిగుబడి మొత్తం తగ్గిపోయింది. ప్రస్తుతం కంది పంటను నూర్పిడి చేస్తున్న అన్నదాతలకు దిగుబడి 2 నుండి 3క్వింటాళ్ల లోపే ఉండటంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా బనగానపల్లె, కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లలో కంది పంట పూర్తిగా దెబ్బతినింది. కొన్ని పొలాల్లో కంది సాగు పూత మొత్తం రాలిపోయి, పంట నూర్పిడి చేసిన విధంగా దర్శనమిస్తోంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా పోయాయని అన్నదాతలు లబోదిబో మంటున్నారు.



రూ. లక్ష నష్టపోయాను

4ఎకరాలు కౌలుకు తీసుకొని కంది పంటను సాగు చేశాను. తుఫాన్, తెగుళ్ల కారణంగా పూత, పిందె రాలి పోయింది. దిగుబడి లేక రూ.1లక్ష వరకు నష్టం వచ్చింది.
- పోరెడ్డి నారాయణరెడ్డి, రైతు, మీర్జాపురం



ప్రభుత్వం ఆదుకోవాలి

కంది పంట నూర్పిడి చేయగా ఎకరాకు రెండు క్వింటాళ్లు వచ్చింది. గిట్టుబాటు ధరలేక పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.
- రమేష్, రైతు

గిట్టుబాటుకాని ధరలు: కంది సాగు కోసం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు ఖర్చులు కలుపుకొని రూ.25 నుండి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. అయితే అరకొరగా పండిన కంది పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో పెట్టుబడులు కూడా రావడంలేదని అన్నదాతలు వాపోతున్నారు. గతంలో క్వింటం రూ.11,000 పైగా ధర పలికిన కంది నేడు రూ.7300 కూడా పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి వస్తే.. ఈ ధరకు పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రావని అంటున్నారు. జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన కంది రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



ఒక్క కాయ కూడా కనిపించని కంది చేను



యంత్రం ద్వారా కంది పంటను నూర్పిడి చేస్తున్న అన్నదాతలు

మా మంచి బడి

- ప్రభుత్వ పాఠశాలలో చదువుల వెలుగు
- ఎన్నో విజయాలు సాధించిన చాగలమర్రి హైస్కూల్
- 1,100 మందికి పైగా విద్యార్థులతో కళకళ
- క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మంచి ఫలితాలు
- క్రీడలు.. పోటీ పరీక్షల్లో టాప్



చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో చదువంటే కార్పొరేట్ పాఠశాలల చదువే. అందరూ ఆ వైపు పరుగులు తీస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వ పాఠశాల వాటిని తలదన్నే ఫలితాలు సాధిస్తోంది. ఉత్తమ ఫలితాల్లో, క్రమశిక్షణలో, పోటీ పరీక్షల్లో, క్రీడల్లో తనకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలోనే మంచి బడిగా పేరెన్నికగన్నది. 1948లో బోర్డ్ పాఠశాలగా ఒక గుడిసెలో ప్రారంభమైంది. 1949లో చాగలమర్రికి చెందిన తొమ్మండ్రు గురుమూర్తి 7.10 ఎకరాల స్థలాన్ని పాఠశాలకు దానం చేశారు. ఆ స్థలంలో భవన నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి పాఠశాల ఎదుగుదల ప్రారంభమైంది. 1950లో జెడ్పీ పాఠశాలగా గుర్తింపు పొందింది. అప్పటి నుంచి అత్యున్నత బోధన అందిస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చింది. ఈ పాఠశాల ప్రారంభమై 74 సంవత్సరాలు పూర్తయింది. నానాటికీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 1126 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 785 మంది బాలురు, 351 మంది బాలికలు. ఇంగ్లీషు మీడియంలో 236 మంది విద్యార్థులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

2007 నుంచి 2022 వరకు ఈ పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

క్రీడల్లో ముందంజ

ఈ పాఠశాల బాలబాలికల్లో జాతీయ స్థాయిలో 20 మంది, రాష్ట్రస్థాయిలో 150 మంది ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రశంసాపత్రాలను అందుకుంటున్నారు.

సమస్యలు వీడలేదు

పాఠశాలకు ఇంతటి ఘన చరిత్ర ఉన్నా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు సరిపోయేలా డైనింగ్ లేకపోవడం, మధ్యాహ్న భోజనం పాఠశాల ఆవరణలో చేయాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదు. స్వీపర్, వాచ్‌మెన్ లేరు. విద్యార్థులు తరగతి గదిలో శుభ్రం చేయాల్సి వస్తోంది. పార్కింగ్ షెడ్లు లేకపోవడంతో ఎండలోనే సైకిళ్ల నిలుపుతున్నారు. వంటగది సరిగా లేకపోవడంతో ఆరుబయట వంట చేస్తున్నారు. బాలికలకు మరుగుదొడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. సోషల్, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యలను అధిగమించి..

పాఠశాలలో సమస్యలు ఉన్నప్పటికీ రోజు రోజుకూ విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2016లో పదోతరగతి పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2022 వరకు 5 మంది విద్యార్థులు 10/10 పాయింట్లు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. పాఠశాలలో సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు చక్రం బీడీ షబ్బీర్ అహ్మద్, కొండయ్య రూ.5 లక్షలు నిధులతో పాఠశాల ముఖద్వారం గేటును ఏర్పాటు చేశారు.


పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

అత్యున్నత విద్యాబోధనతోనే..



విద్యార్థులు గురువుల పట్ల భక్తిభావంతో మెలుగుతున్నారు. విద్యార్థులను మా బిడ్డల్లా చూసుకుంటున్నాం. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవాటు చేస్తున్నాం. అందుకే మంచి ఫలితాలు సాధిస్తున్నాం. పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెస్తున్నారు.

-శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయుడు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఈ పాఠశాల నుంచి నలుగురు టీచర్లు అందుకున్నారు. నారాయణమూర్తి, ఐడీ కృష్ణశాస్త్రి, శ్రీనివాసులు, వెంకటరాముడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం సన్మానించి అభినందించారు.


పాఠశాల వ్యవస్థాపకుడు తొమ్మండ్రు గురుమూర్తి విగ్రహం

ఐక్యమత్యంతోనే పాఠశాల అభివృద్ధి



ఉపాధ్యాయుల ఐకమత్యంతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. విద్యార్థులు ఎప్పటి పాఠాలు అప్పుడే నేర్చుకుంటున్నారు. మంచి మార్కులు సాధిస్తున్నారు. అందరి కృషితో మంచి బడిగా పేరు తెచ్చుకోవడం సంతోషాన్నిస్తోంది.

-కృష్ణశాస్త్రి, ఇన్‌చార్జి హెచ్‌ఎం

క్రమశిక్షణతో విద్యాబోధన..



విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పిస్తున్నారు. చదువులో పోటీతత్వాన్ని పెంచడంలో గురువుల కృషి ఎనలేనిది. వారి కృషి, పట్టుదలతో చదువుతున్నాం. పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తెస్తాం.

- సమీర, పదో తరగతి

ప్రజల్లో నమ్మకం కలిగించాం



మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించడం ద్వారా గ్రామ ప్రజలకు కూడా మాపై నమ్మకం కలుగుతోంది. నా ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఈ పాఠశాలలోనే చదివారు. ఇలా ప్రజల్లో నమ్మకం పెరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వారి పిల్లలను చేర్పుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ప్రభావం తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి.

-మహబూబ్‌బాషా, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు


జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో చైర్మన్, హెచ్‌ఎం



ప్రభుత్వ పండుగగా వడ్డె ఓబన్న జయంతి

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండువగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఎంఎస్ నెంబరు 5 ఉత్తర్వుల మేరకు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న ప్రభుత్వ పండువగా గుర్తించి అన్ని విభాగాల్లో వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేనాటి పాలేగాళ్ల ఆధీనంలో ఉన్న కొన్ని ప్రాంతాలను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి కంపెనీకి అప్పగించే విషయంలో ఘర్షణలు జరిగి క్రమేపి సాయుధ పోరాటాలుగా మారాయి. ఇందులో నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరును ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఈ భీకర పోరులో సైన్యాధ్యక్షుడిగా ఓబన్న పోషించిన వీరోచిత పాత్ర గతంలో అంతగా వెలుగులోకి రాలేదు. వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి దట్టమైన నల్లమల్ల అడవుల్లో సైతం బ్రిటీష్ కంపెనీ సైన్యాన్ని ఊచకోత కోసి వారిని ఉరుకులు పెట్టించడంలో ఓబన్న ముఖ్యపాత్ర పోషించారు. జనవరి 11న ఓబన్న జయంతిని ఏటా నిర్వహిస్తున్నారు. జీవో విడుదల కావడంపై వడ్డెర సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలకు రుణాల పండుగ

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన బీసీ కార్పొరేషన్ జవసత్వాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీవనోపాధి కల్పనకు 50 శాతం రాయతీతో రుణాల మంజూరుకు చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాలో బీసీ, ఈబీసీలు మొత్తం 1844 యూనిట్లును మంజూరు చేసింది. వీటి కోసం రూ.77.69 కోట్లు సబ్సిడీ రుణాలును లబ్ధిదారులకు అందించనున్నారు. వివిధ పథకాల కింద లబ్ధి పొందేందుకు 21 నుంచి 60 సంవత్సరాలలోపు వయసు ఉండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు కుల ధృవీకరణ పత్రం ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తులు ఏపీఓబీ ఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 8 నుంచి 16వ తేదీలోగా చేసుకోవాలి. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.6.40 కోట్లతో 190 యూనిట్లకు బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, సర్వీసెస్ (ఆటో సర్వీసెస్, బ్యాటరీ సర్వీసెస్, కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ గూడ్స్ రిపేర్స్ ఇంజనీరింగ్ వర్క్‌షాపు), వ్యాపారాలు (బేకరీ, ఆటో మొబైల్స్, బ్యూటీ పార్లర్, ఫ్లోర్‌మిల్, ఐరన్‌గేట్ మిషన్) చేసుకుని ఆర్థికంగా స్థిరపడేవారందరికీ రూ.2లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. మెడికల్ షాపులు ఏర్పాటు చేసేందుకు బి ఫార్మసీ, డి. ఫార్మసీ చదివిన నిరుద్యోగులకు అవకాశం కల్పించారు. ఒక్కొక్క షాపుకు రూ.8 లక్షలు అవసరం కాగా, ఇందులో రూ.50 శాతం కింద రూ.4లక్షలు సబ్సిడీ ఇస్తామని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ బుధవారం తెలిపారు.

అహోబిలంలో 10న వైకుంఠ ఏకాదశి

15 నుంచి పార్వేట ఉత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. 10వ తేదీన తెల్లవారు జామున రెండు గంటలకు ధనుర్మాస పూజ నిర్వహించిన అనంతరం నాలుగు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు స్వామి వారిని దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.


ఎగువ అహోబిలంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత జ్వాలా నరసింహస్వామి

15 నుంచి పార్వేట ఉత్సవాలు

అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి పార్వేట ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని మఠం నిర్వాహ కులు తెలిపారు. మకర సంక్రాంతి, ధనుర్మాసం శాత్తుముర్రై పార్వేట ఉత్సవం కోసం ఎగువ అహోబిలం నుంచి జ్వాలా నరసింహ స్వామి దిగువ అహోబిలానికి చేరుకుంటా రన్నారు. దిగువ అహోబిలంలో పార్వేట మహోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్వాలా నరసింహస్వామి ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చేరుకుం టుందని తెలిపారు. దాదాపు 33 రోజుల పాటు స్వామి వారు 34 గ్రామాల్లోని తెలుపుల వద్ద కొలువై ప్రజలచే విశేష పూజలందుకుంటారని నిర్వాహకులు వెల్లడించారు.

రాజకీయాలు కలుషితం: మంత్రి ఫరూక్

పాణ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు కలుషితమయ్యాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అభిప్రాయపడ్డారు. ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల పదో వార్షికోత్సవానికి బుధవారం మంత్రితో పాటు సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ జోక్యంతో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు సివిల్ సర్వీసు చదవాలంటే ఆసక్తి కనబర్చని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో సాంకేతిక కళాశాలలు అభివృద్ధి చెందాయన్నారు. నంద్యాల ప్రాంతం టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్జీఎం కళాశాలతో విద్యా వ్యాప్తి పెరిగిందని ఇందుకు శాంతిరాముడు కృషి ఎంతో ఉందన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థి అసాధారణమైన జీవితానికి ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అవసరమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకర్షించాయి. ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ఎండీ శివరాం, రఘురాం, ప్రిన్సిపాల్ గాయత్రి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్

'తిరుపతి ఘటన బాధాకరం'

నంద్యాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీలో తిరుపతిలో జరిగిన దుర్ఘటన బాధాకరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ వారి భక్తుల మృతి తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుందని తెలియజేశారు.

డెయిరీ సొసైటీని ఎలా రద్దు చేస్తారు..?

- చైర్మన్‌తో చేతులు కలిపారు
- ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి


మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

నంద్యాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : చక్రవర్తుల పల్లె పాల ఉత్పత్తిదారుల సొసైటీలో సభ్యత్వాన్ని రద్దు చేయడం సరి కాదని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సదరు డెయిరీకి చెందిన నలుగురు డైరెక్టర్లతో కలిసి బుధవారం నంద్యాలలోని విజయ డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్‌ను కలిశారు. డైరెక్టర్లకు నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ బోర్డు మీటింగ్ పెట్టి సొసైటీని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పలేని ఎండీ డెయిరీ చైర్మన్‌పై తోసేశారు. అనంతరం ఆయన జగత్ విఖ్యాత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ డెయిరీ చైర్మన్‌కు తనపై ఏదైనా కక్ష ఉంటే తనపైనే చూపించాలనిగాని చక్రవర్తులపల్లె సొసైటిని రద్దు చేసి పాల రైతులను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదన్నారు. తాను బకాయిలు ఉన్నట్లు నిరూపిస్తే.. తానే రాజీనామా చేయడానికి సిద్ధమని అన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా బోర్డు మీటింగ్ పెట్టడం, అదీ కూడా నంద్యాల డెయిరీలోను, కర్నూలు డెయిరీలోను కాకుండా చైర్మన్ ఇంట్లో గుట్టుగా బోర్డు మీటింగ్ నిర్వహించి సభ్యత్వం రద్దు చేస్తామని ప్రకటించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు.

నంద్యాల విజయ డెయిరీలో అలజడి..

నంద్యాలలోని విజయ డెయిరీ వ్యవహారం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇరువర్గాలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఆ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల కిందట బోర్డు మీటింగ్ పెట్టి చాగలమర్రి మండలం చక్రవర్తిల పల్లి పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షుడైనా భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- ఉదయం నుంచే ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించిన ఉలేమాలు
- నేటితో ముగియనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా


ఇజితెమాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు కేంద్రంగా జరుగుతున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం రెండో రోజైన బుధవారం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇజితెమా కార్యక్రమానికి మంగళవారం రాత్రికే వేలాది సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. దీంతో బుధవారం తెల్లవారు జాము నుంచే సామూహిక ప్రార్థనలు మొదలయ్యాయి. అలాగే ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి విచ్చేసిన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను బోధించారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఏలోటు రానివ్వకుండా ఇజితెమా నిర్వహణ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ తదితర సదుపాయాలను సమకూర్చారు. అదేవిధంగా ఇజితెమాకు హాజరైన ముస్లింలకు దాతలు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆయా జిల్లాల వారికి వేరువేరుగా భోజన కౌంటర్లను ఏర్పాటు సౌకర్యవంతమైన సేవలు కల్పించారు. అంతేగాకుండా ఆయా రూట్ల మీదుగా వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రదేశాలను కేటాయించి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు పడగ్బందీ చర్యలు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ తరుపున వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కాగా గురువారం మధ్యాహ్నానికి ఇజితెమా ముగియనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ వారు పేర్కొన్నారు. ఇదిలావుంటే ఇజితెమా ప్రాంగణమంతా ఎక్కడా చూసినా సందడి వాతావరణం నెలకొంది. మారుమూల ప్రాంతమైన ఆత్మకూరులో ఇంతటి భారీ వేడుక జరగడం పట్ల ఇక్కడి ముస్లిం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇజితెమాను సందర్శించిన ప్రముఖులు

ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరుగుతున్న ఇజితెమా కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇజితెమా ఏర్పాట్ల గురించి కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పవిత్రమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం శుభపరిణామమన్నారు. 2019లో కర్నూలులో జరిగిన అంతర్జాతీయ ఇజితెమాకు కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరం అందించినట్లు గుర్తు చేశారు. అనంతరం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో ఇలాంటి పవిత్రమైన కార్యక్రమం జరగడం పుణ్యప్రదమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇజితెమాకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రత్యేకించి ఇజితెమా ముగిసిన అనంతరం తిరిగి వెళ్లే వారికి ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు.


ఇజితెమా ప్రాంతంలో ముస్లింల సందడి


కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

మోదీకి బ్రహ్మరథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం


విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్


బహిరంగ సభకు హాజరైన అశేష జనం

విద్యార్థులకు వర్చువల్ బోధన

- రాష్ట్రంలోనే ప్రథమంగా కర్నూలులో ఏర్పాటు
- రేపు ప్రారంభించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి విద్యార్థులకు సులభతరమైన రీతిలో నాణ్యమైన విద్యను అందించేందుకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ వినూత్న రీతిలో చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలో వర్చువల్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ రిసోర్స్ నెట్‌వర్క్ స్టూడియో ఏర్పాటు చేసింది. దీనికి జిల్లాలోని 352 పాఠశాలలను అనుసంధానం చేశారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల చేత లైవ్‌లో క్లాసులను ఇంటరాక్టివ్ మోడ్‌తో పాఠ్యాంశాలను బోధిస్తారు. రోజుకు 24 గంటలు గ్రూపు అందుబాటులో ఉంటుంది. జిల్లాలో తక్కువ వ్యయంతో అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగించి జిల్లా కేంద్రంలో ఈ-లెర్న్ విలాన్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పాఠాలతోపాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత డిజిటల్ పాఠ్య భాగాలను తయారు చేసి యూట్యూబ్ చానల్‌ట సెలవుల్లో కూడా నేర్చుకునే వెసులుబాటు కల్పించారు. అనివార్య కారణాలతో విద్యార్థులు తరగతులకు గైర్హాజరైనా, భూకంపం, వరదలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాఠశాలలకు దీర్ఘకాలంగా సెలవులు ప్రకటించినా పాఠాలు వినే అవకాశం ఉంది.


నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ భవనం

వర్చువల్ స్టూడియోలో డెమో క్లాసెస్ ఉపాధ్యాయుల చేత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేయడానికి వర్క్‌షాపును నిర్వహించుకునే ఏర్పాట్లు చేశారు. దీంతో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతకు దోహదపడుతుంది. జిల్లాలోని ఆదోని డివిజన్‌లోని మండలాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీన్ని అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. ఎక్స్‌పర్ట్ సబ్జెక్టు ఉపాధ్యాయులచే పాఠ్యాంశాలను బోధిస్తారు. విద్యుత్, నెట్‌వర్క్ సమస్య ఏర్పడితే ఆ మరు సటి రోజు వీడియో ఆఫ్ యూట్యూబ్ చానెల్ ద్వారా పొందవచ్చు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో 2,800 కెమెరాలను, ఐఎఫ్‌టీ (ఇంటరాక్ట్ ప్లాట్ చానల్) ద్వారా స్టూడియోలో బోధించిన ఆన్‌లైన్ పాఠాలు టెలికాస్ట్ అయ్యేలా ఏర్పాటు చేశారు. పాఠ్యాంశాలతోపాటు పర్సనల్ డెవలప్‌మెంట్, క్యారీర్ గైడెన్స్, కొన్ని రకాల రుగ్మతలకు విద్యార్థుల ప్రవర్తనా సమస్యలను రూపుమాపేలా సైకాలజీ కౌన్సెలర్ల సెషన్స్‌ను నిర్వహించాలని విద్యాశాఖ ఆలోచిస్తోంది.

రేపు స్టూడియో ప్రారంభం

కర్నూలు నగరం సుంకేసుల రోడ్డులోని నగర పాలక సమావేశ భవనంలో వర్చువల్ క్లాస్ స్టూడియోను శుక్రవారం మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు. స్టూడియోను విద్యా శాఖ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పనులను శరవేగంగా నిర్వహించేలా డీఈవో శామ్యూల్ పాల్ చర్యలు తీసుకుంటున్నారు.

జైళ్లలో కుల వివక్షపై తనిఖీ

కర్నూల లీగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచలింగాలలోని జిల్లా జైలు, నగరంలోని మహిళల జైళ్లలో కుల ఆధారిత వివక్ష, ఇతర రకాల వివక్షలు ఏమైనా జరుగుతున్నాయా అని తెలుసుకోవడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా జైలులో కుల ఆధారిత వివక్ష గురించి ఆయన ఆరా తీశారు. కులమత బేధాలు లేకుండా ఖైదీలు సత్ప్రవర్తనతో తమ శిక్ష కాలాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబరు 15100ను డయల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఖైదీలను తప్పనిసరిగా కోర్టు వాయిదాలకు హాజరు పరిచేలా జైలు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖైదీలకు అందించే ఆహారం, ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. అనంతరం ఆయన నగరంలోని మహిళా జైలును కూడా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది పి.వెంకటేశ్వర్లు, కేంద్ర కారాగార సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.


జిల్లా జైలులో రికార్డులను పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కోసిగి దేవరలో అపశ్రుతి

- మారెమ్మ పోతు దాడిలో నలుగురికి గాయాలు..
- ఒకరి పరిస్థితి విషమం

కోసిగి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోసిగి దేవరలో బుధవారం తెల్లవారుజామున మారెమ్మ పోతు ఊరేగింపు సందర్భంగా అపశృతి చోటు చేసుకుంది. మారెమ్మపోతు దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో చంద్ర అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జరిగే మారెమ్మ దేవర సందర్భంగా మారెమ్మ దున్నపోతును ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ. ఊరేగింపు నిర్వహిస్తుండగా మారెమ్మ పోతు దాడి చేసింది. దీంతో కోసిగికి చెందిన చంద్ర, కోడి పెద్ద ఈరన్న, ఆదర్శ్, నరసింహులు, భీమేష్‌తోపాటు మరి కొంత మంది గాయపడ్డారు. చంద్ర అనే యువకుని గొంతులో మారెమ్మ పోతు కొమ్ము బలంగా తగలడంతో స్వరపేటిక దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆ యువకుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఆసుపత్రికి తరలించారు.

10న ప్రజాభిప్రాయ సేకరణ

- రెండో రోజూ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌ఈ

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై ఈ నెల 10న నిర్వహిస్తున్న బహిరంగ ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఈ ఎం.ఉమాపతి కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో విజయవాడలో రెండవ రోజూ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. బుధవారం కర్నూలు విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన విడియో కాన్ఫరెన్‌లో ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి పాల్గొన్నారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన బహిరంగ, వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు అభ్యంతరాలను తెలిపారు. ముఖ్యంగా శుక్రవారం కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై నిర్వహించే ప్రజా అభిప్రాయ సేకరణలో సూచనలు, సలహాలు, అభ్యంతరాలను తెలియజే యాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ఓబులేసు, ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్‌ఈ ఉమాపతి

కందుల వ్యాపారికి జరిమానా

ఆస్పరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం గ్రామానికి చెందని కందులు, శనగల వ్యాపారి రంజాన్ తూకంలో మోసానికి పాల్పడడంతో ఆయనకు రూ.50 వేల జరిమానా విధించినట్లు బుధవారం ఆదోని తూనికలు, కొలతల శాఖ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులను 50 కిలోలుగా తీసుకోవాల్సి ఉండగా అదనంగా 54 కిలోలు తీసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. దీంతో తూనికలలో మోసానికి పాల్పడినట్లు వెల్లడైందని తెలిపారు. డిజిటల్ కాటాలో మోసాలకు పల్పాడినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు.

వృద్ధురాలి గల్లంతు

హాలహర్వి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపురం గ్రామంలో రత్నమ్మ (70) అనే వృద్ధురాలు ఎల్లెల్సీలో గల్లంతైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ కడుపు నొప్పి తాళలేక మనస్తాపానికి గురై కాలువలో పడి మృతి చెందిందని నీళ్లలో మునిగిపోయిన మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ఆలూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలోని సర్వే నెంబరు 1లో ఆక్రమణకు గురైన హంద్రీనది పోరంబోకు భూమిలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్ శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన తహసీల్దారు ఆధ్వర్యంలో సాయంత్రం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకునే క్రమంలో ఆక్రమణదారులు భూమిని వ్యవసాయేతర భూమిగా ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నట్లు పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ప్లాట్లుగా మార్చిన వెంచర్‌లో హద్దు రాళ్లుగా మొక్కలు నాటి రెవిన్యూ అధికారుల కళ్లుగప్పేందుకు కబ్జాదారులు కుట్రకు పాల్పడ్డారు.. ఆపై ఏకంగా ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తోలి మట్టి రోడ్డు ఏర్పాటు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రజా అవసరాలకు ఉపయోగించాల్సిన హంద్రీ నది పోరంబోకు భూమి ఆక్రమణకు గురికావడం పట్ల గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం అవుతున్నాయని వార్త ప్రచురించిన నేపథ్యంలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు ఆదేశాల మేరకు చిన్నటేకూరు గ్రామ వీఆర్వో రామాంజనేయులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కల్లూరు తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. చిన్నటేకూరు సర్వే నెంబర్ 1 హంద్రీ పోరంబోకు భూముల్లో కబ్జాలకు పాల్పడితే సెక్షన్ 3 పీడీపీపీ యాక్ట్ 1984, సెక్షన్ 7, ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టం 1905 ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కె.ఆంజనేయులు స్పష్టం చేశారు.

ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపులో జాప్యమెందుకు?

- వైద్యం అందక ఎవరైనా మరణిస్తే సీఎందే బాధ్యత
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

పత్తికొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం బిల్లుల చెల్లింపులో కూటమి ప్రభుత్వం జాప్యమెందుకు చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం పత్తికొండకు వచ్చిన ఆయన స్థానిక ఎస్‌ఆర్ స్వగృహంలో మాజీ కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.3వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. నిధులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం సరికాదని అన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సర్వీసులను నిలిపివేయాని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందక ఎవరైనా మరణిస్తే అందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆ తరువాత సీఎం చంద్రబాబుపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేసేలా న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామన్నారు. కూటమి రూ.75వేల కోట్లు అప్పులు తెచ్చినా సూపర్ సిక్స్, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్‌చార్జీలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రజానీకంపై రూ.15 వేల కోట్లు అదనపు భారం పడిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన గాడి తప్పిందన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ క్యాలెండర్ విడుదల సంక్షేమ పథకాలు అందించించామని చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రామకొండ సుధాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భరత్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు

- అర్ధరాత్రి హైద్రాబాదులో పట్టుకున్న పోలీసులు


దొంగను మీడియాకు చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగ ఎట్టకేలకు దొరికాడు. అర్ధరాత్రి హైద్రాబాదులో ఆదోని పోలీసులను చూసి పరుగులు పెట్టిన మురళీని త్రీటౌన్ పోలీసులు వెంట పడి పట్టుకున్నారు. ఆదోని పోలీసులను ఎస్పీ బిందు మాధవ్ అభినందించి, ఇలాంటి ఘటన పునరావృతం కాకూడదని నేరస్థుల విషయంలో జాగ్రత్తలను పాటించాలని సెట్ కాన్ఫరెన్స్‌లో సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మొహినాబాదు మండలం సూరగాలి గ్రామానికి చెందిన మురళీపై తెలంగాణ, ఆంధ్రాలో 70 కేసులు నమోదయ్యాయి. 5వ తేదీన దొంగతనం కేసులో కోర్టుకు తరలిస్తుండగా, పోలీసుల కళ్లుగప్పి కోర్టు గోడదూకి పరారయ్యాడు. దీంతో ఆంధ్రజ్యోతి మంగళవారం కోర్టు గోడ దూకి, బుధవారం దొంగ దొరకలేదు... అనే కథనాలను ప్రచురించింది. ఎస్పీ సీరియస్ కావడంతో దొంగను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలు హైద్రాబాదుకు చేరుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటిన తరువాత మఫ్టీలో పోలీసులు మురళీ ఇంటికి చేరుకున్నారు. పోలీసులను గుర్తించిన దొంగ తన ఇంటి గోడ దూకి పరారయ్యాడు. పోలీసులు దొంగను వెంటాడి పట్టుకొని ఆదోనికి తరలించారు. దొంగను రిమాండ్‌కు తరలించామని సీఐ సూర్య మోహన్ రావు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తెగులు గుబులు అన్నదాతకు దిగులు



తెగుళ్లు సోకిన మినుము పంట

- వేల ఎకరాల్లో మినుము పంట నాశనం
- అదుపులోకి రాని తెగుళ్లు.. రైతులకు తీవ్ర నష్టం
- 600 వందల ఎకరాలకు పైగా దున్నేసిన రైతులు

పాములపాడు జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు ఈ ఏడాది కూడా కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. రబీలో ఎంతో ఆశగా మినుము పంటను సాగు చేస్తే తీరా నిరాశే మిగిలింది. పంట సాగు చేసినప్పటి నుంచి వివిధ రకాల తెగుళ్లు సోకాయి. దీంతో వేల రూపాయలు వెచ్చించి పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తెగుళ్లు అదుపు కాక పోవడంతో కొంతమంది రైతులు పంటను దున్నేస్తున్నారు. మరికొంత మంది రైతులు ఆశ వదులుకోక అలాగే పంటను సాగు చేస్తున్నారు.

మండలంలో రబీలో దాదాపు ఆరు వేల ఎకరాలలో మినుము పంట సాగు చేశారు. పాములపాడు, రుద్రవరం, చెలిమిళ్ల, లింగాల, ఇస్కాల, బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట, మద్దూరు, వాణాల తదతర గ్రామాల్లో అత్యధికంగా పంట సాగుచేశారు. అయితే విత్తనం వేసిన ఇరవై రోజునుంచే వేరుకుళ్ళ, కాండం ఈగ, తెల్లదోమ, బూడిద తెగులు సోకి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. కొరాజిన్, రిమాన్, ఫెడిస్టిల్, లాంటి ఖరీదైన మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎకరాకు పది క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా ఒక్కటి, లేదా రెండు క్వింటాళ్లు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ. 25 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని, కనీసం కూలీలకు కూడా వచ్చే పరిస్తితి కనిపించడం లేదు. గత రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఎదురవుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయాధికారులు పంటల వైపు కన్నేతి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాస్త్రవేత్తలతో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



వేరు కుళ్లు సోకిన మినుము పంట

పంట పూర్తిగా నాశమైంది..



ఈ ఏడాది రబీలో ఐదు ఎకరాలలో మినుము పంట సాగుచేశా. తెగుళ్ల సోకి పంట దెబ్బతింది. రూ.లక్ష ఇరవైవేలు పెట్టుబడులు పెట్టాను. చివరికి పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

\- శివుడు, రైతు రుద్రవరం

తెగులు అదుపు కావడం లేదు..



పంటకు వేలకు వేలు వెచ్చించి పరుగు మందులు పిచికారి చేసినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. సాగు చేసిన మూడు ఎకరాల మినుముపంట సర్వ నాశనమైంది. రూ.70 వేలు నష్టపోయాను. ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- నాగేశ్వరరావు, రుద్రవరం, రైతు

నిందితుడిని అరెస్టు చేయాలి



ఏఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

పాణ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేసిన నిందితుడ్ని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాణ్యం ఏఎస్ఐ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన తమ్మరాజుపల్లెలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మిపై శివకుమార్ అనే వ్యక్తి దాడికి పాల్పడి గాయపర్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మధు, మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచాలి



ఆదివాసీ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గిరిజన నాయకులు

పాణ్యం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ పేర్కొన్నారు. బుధవారం పాణ్యం ఇందిరానగర్‌లో గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. గిరిజనులు ఆత్మగౌరవాన్ని పెంచేలా సమ్మేళన సభ ఈనెల 19 న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, ఎరుకల సేవా సంఘం జిల్లా నాయకులు నాగశేషుడు, గిరిజనులుపాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్యారడైజ్ వెంచర్‌లో ఉన్న పబ్లిక్ స్థలాన్ని అమ్ముకున్న వారిపై కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ బేబీకి సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్యారడైజ్ స్థలంలో జరిగిన అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలివిడిగా వెంచర్లు వేసి అమాయక ప్రజల్ని మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై సీపీఎం బృందం పర్యటించి సర్వే చేపట్టి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ బాష, బాలస్వామి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి గోకులాలు ప్రారంభం

నంద్యాల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండల పరిదిలోని వివిధ గ్రామాలలో నిర్మించిన గోకులాలను 10, 11 తేదీల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 10న కానాల (హెచ్ఎస్ కొట్టాల), పాండురంగాపురం, మిట్నాల, పుసులూరు, పోలూరు గ్రామాలలో ఉంటాయన్నారు. అలాగే 11న కొత్తపల్లి, పెద్ద కొట్టాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం ద్వారా మూగజీవాల సంరక్షణార్థం గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం నిదులు కేటాయించినట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమా లలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, రైతులు పొల్గొనాలని కోరారు.

వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలి



ఏఈకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోట మద్దులు డిమాండ్ చేశారు. బుధవారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏఈ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రా ష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని ట్రూఅప్, సర్‌చార్జీల పేరిట లక్ష కోట్లకు పైగా ప్రజలపై భారం వేయడం తగదన్నారు.

హామీలను అమలు చేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందికొట్కూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నందికొట్కూరు పట్టణంలోని ఏపీ ఎన్జీవోస్ హోంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయం నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ, ఐఆర్‌లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శారద, జబీన్, బిచ్చారెడ్డి, జాయింట్ సెక్రటరీలు శ్రీజ, వరలక్ష్మి, వెంకటలతా, మాదన్న, ట్రెజరర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

గడివేముల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలను బుధవారం మార్క్‌ఫెడ్ డీఎం హరినాథ్‌రెడ్డి, వ్యవసాయశాఖ టెక్నికల్ ఏవో కల్యాణ్‌కుమార్‌లు తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రంలోని నిర్వహణ, ఎరువులను పరిశీలించారు. రైతుల వేలి ముద్రలు తీసుకొని ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

గడివేముల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం హోరాహోరిగా సాగాయి. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌హైస్కూల్ క్రీడా మైదానంలో మండలంలోని 12 పాఠశాలలకు సంబంధించిన క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలకు సుమారు 600 మంది బాల బాలికలు పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన పోటీలలో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిందాల్ సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, జెడ్పీహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానుయేల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రథానికి మరమ్మతులు

మహానంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో జరిగే మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నాటికి రథానికి మరమ్మతు పనులు పూర్తి చేస్తామని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నుంచి వచ్చిన రథం మరమ్మతుల నిపుణులతో కలసి ఆలయ పరిసరాల్లోని రథశాలలోని రథాన్ని ఈవో పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం మాడవీధుల చుట్టూ తిరిగే రథం తిరిగేందుకు వీలుగా అవసరమైన చిన్న చిన్న మరమ్మతుల గురించి నిపుణులతో చర్చించారు. వీలైనంత త్వరగా రథానికి అవసరమైన మరమ్మతు పనులను చేపట్టి బ్రహ్మోత్సవాలకు రథానికి సిద్ధం చేయాలని ఈవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధుతో పాటు ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

వెలుగోడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెలుగోడులోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వాహిద్ అనే విద్యార్థి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. విద్యార్థి ఆరోగ్యం విషమించడంతో ప్రతి రోజు రూ 70 వేలు ఖర్చు అవుతున్నాయి. దీంతో ఆర్థిక స్తోమత లేని ఆ విద్యార్థి కుటుంబానికి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.95వేలు వసూలు చేసి విద్యార్థి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే సోషల్ మీడియాలో సైతం పలువురు స్పందించి విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. సాయం చేసిన వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్టు ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రాంతీయ సంచాలకులు వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం జోన్ పరిధిలో 15 కాంట్రాక్టు ఫార్మసిస్టు ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఉద్యోగానికి దరఖాస్తు సమూనా, ఇతర వివరాలు సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని అన్నారు. అభ్యర్థులు దరఖాస్తు రుసుంతోపాటు పోస్టుకు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరిచి 17వ తేదీ సాయంత్రం 5గంటలలోపు కడప వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

పాములపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ సహకార సంఘం రైతులు ఈకేవైసీని త్వరగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం జూటూరు, మిట్టకందాల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులతో వారు మాట్లాడుతూ మినుములో తెల్లదోమ, పచ్చదోమ నివారించడానకి పసుపు,తెలుపు నీలపు, పల్లాలను పెట్టాలని సూచించారు. జీలిగా మినుములు, పెసర లాంటి పంటలు సాగుచేసి భూసారం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గా చరణ్ గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులను సరిదిద్దుకోవాలి

మహానంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ద్వారా రైతులు వ్యవసాయ భూములను సరిదిద్దు కోవాలని మండల తహసీల్దార్ పి. రమాదేవి తెలిపారు. బుధవారం మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలో రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఏమైన భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు. రైతులందరు సంయుక్తంగా రీ సర్వే జరిగే కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, టీడీపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే



స్విచ్ ఆన్ చేసి సిద్ధాపురం చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, రైతులతో కలిసి సిద్ధాపురం చెరువు ప్రాంతంలో ఫేజ్-2 పంప్‌హౌస్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మోటర్లను ఆన్ చేసి సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీరు విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ..సిద్ధాపురం చెరువు కింద రబీలో పంటలు సాగు చేసిన రైతుల అవసరార్థం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని చెరువుకు పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు రెండు పంపుల ద్వారా రోజుకు 200 క్యూసెక్కుల నీటిని చెరువుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ సుబ్బరాయుడు, ఈఈ శంకర్‌రెడ్డి, డీఈలు వెంకటేశ్వర్లు, బాపూజీ, ఏఈలు శరభారెడ్డి, శివనాయక్, ఉదయ్, ఇలియాస్, కేసీ కెనాల్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



నాగరాజు పార్థీవ దేహనికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పుట్టల నాగరాజు బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గ్రామానికి వెళ్లి నాగారజు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాగరాజు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపాలు, పెద్ద దస్తగిరి, జయరాజు, మహానంది, సుధాకర్, రవి, రామకృష్ణ, మల్లి అశోక్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

పాసు పుస్తకాల అప్పగింత

మహానంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయానికి చెందిన తమ్మడపల్లి లోని సర్వే నెంబర్ 314లోని పట్టాదారు పాసు పుస్తకాలను ఇనామ్‌దారులు మండల తహసీల్దార్ రమాదేవికి బుధవారం అప్పగించారు. మహానంది దేవస్థానానికి సబంధించిన తమ్మడపల్లిలోని అనకల ఇనామ్, కుమ్మరి ఇనామ్‌కు సంబంధించిన సర్వే నెంబర్ 303,314లోని భూముల వ్యవహారంపై ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి గతంలో కలెక్టర్‌ను కలిసి విచారించాలని కోరారు. ఇందులో భాగంగా మహానంది తహసీల్దార్‌ను ఆ భూములపై విచారించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇనామ్ దారులు విచారణకు హాజరయ్యారు. ఇందులో 314 సర్వే నంబర్‌కు సంబంధించిన పాసు పుస్తకాలను తహసీల్దార్‌కు అప్పగించారు. 303 సర్వే నంబర్‌కు సంబంధించి నలుగురు అన్నదమ్ములు ఉండడంతో, అందులో ముగ్గురు మాత్రమే హాజరు కావడంతో 17వ తేదీ తిరిగి విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఆత్మకూరురూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మినము పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండంలోని కరివేన, నల్లకాలువ గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పొంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో మాట్లాడుతూ..రైతులు రబీలో తాము సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు ఎరువులు పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో హేమలత, వ్యవసాయ విస్తరణాధికారి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

బండిఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులకు విత్తన శుద్ధిపై బుధవారం ఏవో స్వాతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సుడోమోనస్ బయోఫంగిసైడ్ అనే ద్రావకంతో వరి విత్తనాలను శుద్ధి చేయడంతో నారు మడులు 20 నుంచి 30 రోజులు ఎలాంటి తెగుళ్ళు రావన్నారు. రబీ సాగు పంటలకు ఈ నెల 15వతేదీ లోగా బీమా చేయించుకోవాలన్నారు.

కారు ఢీ కొని బాలుడికి గాయాలు

మహానంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహానందిలో బుధవారం అనంతపురం జిల్లా ఎల్లనూరుకు చెందిన కార్తీక్ అనే బాలుడిని రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్లనూరుకు చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులతో కలసి మహానందిశ్వరుడి దర్శనం కోసం వచ్చారు. ఉదయం భక్తుడి కుమారుడు కార్తీక్ గది సమీపంలోని ప్రధాన రహదారిలో రోడ్డు దాటుతండగా మహరాష్ట్రకు చెందిన కారు ఢీ కొంది. ఈప్రమాదంలో గాయపడిన బాలున్ని కుటుంబ సభ్యులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

కమిషనర్ వర్సెస్ పెట్రోల్ డీలర్ వాగ్వాదం

- డీలర్‌పై పోలీసులకు కమిషనర్ ఫిర్యాదు

నంద్యాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : ఓ పెట్రోల్ బంక్ అనుమతి వ్యవహారం రెండు జిల్లాల్లో వివాదాస్పమైంది. ఏకంగా కమిషనర్, పెట్రోల్ డీలర్ మధ్య వాగ్వాదానికి దారి తీయడం నంద్యాల జిల్లాలో కలకలం రేపింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు. నంద్యాలకు చెందిన పెట్రోల్ డీలర్ వెంకటేశ్వర్లు తన కుమారుడి పేరిట పెట్రోల్ బంక్ అనుమతి కోసం 2019లో ఒంగోలు కమిషనర్‌గా పని చేస్తున్న ప్రస్తుతం నంద్యాల కమిషనర్ నిరజంన్‌రెడ్డిని అప్పట్లో అక్కడ ఆశ్రయించారు. ఆయితే సదరు అనుమతులు కోసం రూ.3 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. దీంతో చేసేదీ లేక రూ.లక్ష ఇచ్చేశాను. ఆ తర్వాత కూడా పెండింగ్‌లోనే పెట్టి ఆ తర్వాత బదిలీపై వెళ్లిపోయారు. ఆయితే తాజాగా ఇదే డీలర్‌కు నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఓ పెట్రోల్ మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో నంద్యాల కమిషనర్ పెట్రోల్ బంక్ పనులు పరిశీలించి అక్రమంగా డివైడర్ ఉందని తొలగించమని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సదరు డీలర్ కమిషనర్‌ను రెండు రోజుల కిందట కలిసి 'సార్ అప్పుడు నాకు పని చేయలేదు. నగదు వెనక్కి ఇవ్వలేదని' నిలదీశాడు. తాజాగా బుధవారం శ్రీనివాస్‌నగర్ సమీపంలో టీస్టాల్ వద్ద కమిషనర్ ఉండగా డీలర్ వెంకటేశ్వర్లు కమిషనర్ కారు వద్దకు వెళ్లి డోర్ తీసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పరస్పరం వాగ్వాదం చోటుచేసుకుంది. కమిషనర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. మున్సిపల్ సిబ్బంది తమ తమ కమిషనర్‌పై డీలర్ దాడి చేశారని ఆందోళన చేయడంతో నగరంలో ఉద్రిక్తత వాతవరణం నెలకొంది.


వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- 10న ప్రాతఃకాలం నుంచే ప్రారంభం కానున్న ప్రత్యేక పూజలు
- సదుపాయాల కల్పనలో నిమగ్నమైన ఆలయ కమిటీ
- అదే రోజు స్వామివారికి భక్తులచే తులాభారం



వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వారము దిశగా కొలువుతీరే ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఇందులో భాగంగా దీంతో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట చేస్తున్నారు. ఆలయానికి విద్యుత్‌దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే క్యూలైన్లు తదితర సదుపాయాలను కల్పిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆ తర్వాత సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 9గంటల వరకు దర్శనవేళలను నిర్ణయించారు. వెంకటేశ్వర స్వామివారికి తులాభార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు అందించే నాణేల కానులతో తులాభారాన్ని నిర్వహించేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు



నంద్యాల కల్చరల్: నంద్యాల సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం కమిటీ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బాగంగా 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని యాలకులతో సుగంధ వేంకటేశుడిగా వెంకటేశ్వరస్వామిగా విశేష అలంకారంతో ముస్తాబై భక్తులకు దర్శనమిస్తారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా ఆదిశేషవాహనంపై ఉత్సవ మూర్తుల దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. జనవరి 13న తిరుప్పావై వ్రత పరిసమాప్తి గోదాదేవి సమేత రంగనాథస్వామి వారి దివ్వ కల్యాణోత్సవం అనంతరం తీర్థప్రసాదం వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షులు సముద్రాల సూరయ్య, కమిటి సభ్యులు శ్రీనివాస్, పార్థసారది క్రిష్ణ, మధు, సభ్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందు తుందని సర్పంచ్ మెట్ల సరళ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.ఎనిమిది లక్షల మండల నిధులతో పనులు చేయించడానికి ప్రతిపాదనలు తయారు చేశామని, వీటిని అమలు చేయించాలన్నారు. అలాగే స్వామినగర్ కాలనీలో వివిధ పనులు చేయించడానికి సుమారు రూ.20లక్షల చొప్పున ప్రతిపాదనలు పంపామని, వీటిని త్వరలోనే అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడు అధికారులకు సూచించారు. అనంతరం ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడు మాట్లాడుతూ గ్రామసభలో ప్రవేశపెట్టిన ప్రతి పని అలాగే మంజూరైన అన్ని పనులను త్వరలోనే అమలు పరుస్తామని ఆయన తెలిపారు. ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడానికి సహాయ సహకారాలుఅందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ప్రసాదరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను పరీక్షించిన వైద్యులు

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గృహాలకు, వీల్‌చైర్‌లకు పరిమితమై వైద్య సహాయం కింద రూ.15 వేలు పింఛన్‌లను పొందుతున్న లబ్ధిదారులను జిల్లా వైద్య బృందం బుధవారం ఇంటింటికి వెళ్లి పరీక్షించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నుంచి వచ్చిన వైద్య బృందం సభ్యులు మోహన్‌నాయక్, రాజశేఖర్, స్వరూప్, నేగల్ల హుసేన్ పింఛన్‌దారులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, వెల్ఫేర్ సహాయకులు, డీఏలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

- ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఎంఈవో న్యామతుల్ల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఏవో చంద్రకళ, డైరెక్టర్ శారద, చంద్రమౌళి, హెచ్‌ఎం మహమ్మద్‌రఫి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని గ్రామ స్థాయి క్రికెట్ పోటీలు ఈనెల 11నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన పెద్దాయన, తమ తండ్రి అంబటి శివశంకరరెడ్డి జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వ్యవసాయదారులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

బనగానపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయదారులు తమ నైపుణ్యాలను పెంచుకొని పంటల ఉత్పత్తులను అధికం చేయాలని శాస్త్రవేత్త బాలకృష్ణ, కేవీకే శాస్త్రవేత్త రమణయ్య సూచించారు. బుధవారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం నందు హరిజన ఉపప్రణాళికలో భాగంగా నార్మ్, హైదరాబాద్ వారిఆధ్వర్యంలో నిమ్మలో మేలైన యాజమాన్య చర్యలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఉద్యాన వన శాస్త్రవేత్త ఆదినారాయణ, భూవిజ్ఞానశాస్త్రవేత్త రమణయ్య, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యపై వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఏవో సురేశ్, శాస్త్రవేత్తలు రవిగౌడ్, ఆళ్లగడ్డ డివిజన్‌లో మర్రిపల్లె, కోటకందుకూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



జలదుర్గంలో ఉల్లిని పరిశీలిస్తున్న హెచ్‌వో, బీజేపీ నాయకులు

ప్యాపిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు కేసీ మద్దిలేటి, దామోదర నాయుడు ఉద్యానవన శాఖ అధికారి కళ్యాణిని కోరారు. బుధవారం మండలంలోని జలదుర్గంలో దెబ్బతిన్న ఉల్లి పంటను ఉద్యానవనశాఖ అధికారి పరిశీలించారు. నకిలీ విత్తనాల వలన దెబ్బతిని ఉంటే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఆమె బీజేపీ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పచ్చ పురుగును నివారించుకోవాలి

సంజామల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శనగ పంటను ఆశిస్తున్న పచ్చ పురుగును నివారించాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి శనగ రైతులను కోరారు. బుధవారం మండలంలోని పేరుసోమల, ఆల్వకొండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్, విలేజ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా కల్వటాల గ్రామం

కొలిమిగుండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు పైలెట్ గ్రామంగా కొలిమిగుండ్ల మండలం నుంచి కల్వటాల గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత వెల్లడించారు. బుధవారం పైలెట్ గ్రామంగా ఎంపికైన కల్వటాలలో సర్పంచ్ కామిని సుమలత, కామిని క్రిష్ణరంగారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రీ సర్వే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి నుంచి కల్వటాల గ్రామంలో రీ సర్వే పనులు ప్రారంభమవుతాయని, ప్రతి ఒక్కరూ రీసర్వేకు సహకరించాలని కోరారు. కామిని బాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సహకారం అవసరం

బనగానపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంతో ఉపాధ్యాయుల సహకారం అవసరమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన ఏపీటీఎఫ్ డైరీని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, గోవిందనాయక్, వెంకట కృష్ణుడు, రమేశ్, యాగంటప్ప, పోలియోనాయక్, ఓబులేసు, వీరన్న, చాంద్ బాష, శేఖర్, మహ్మద్‌రఫి, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

ఉల్లిని దున్నేస్తున్నారు

- మాయదారి తెగుళ్లతో 500 ఎకరాల్లో పంట నాశనం
- రూ.కోట్లలో నష్టం
- గగ్గోలు పెడుతున్న రైతులు

ప్యాపిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాయదారి తెగుళ్లు ఉల్లి పంటను నాశనం చేశాయి. రూ.లక్షలకు లక్షలు పెట్టుబడులు పె ట్టి సాగుచేసిన పంట పూర్తిగా దెబ్బతింది. వం దల ఎకరాల్లో పంట సర్వనాశనమైంది. రూ. కోట్లల్లో నష్టం వాల్లింది. పంటసాగు చేసి మూడు నెలలైన గడ్డలు ఏమాత్రం రాకపోవ డంతో ఉల్లిరైతు కన్నీరు కారుస్తున్నాడు. పంట నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లితే ఏ కారణం చేత దెబ్బతిన్నదో పరిశీలించి చెబుతామని చెప్పడంతో రైతులు చేసేదేమిలేక కోటి ఆశలతో సాగు చేసిన పంటను రైతులు దున్నేస్తున్నారు.



ట్రాక్టర్‌తో పంటను దున్నేస్తున్న రైతు తిమ్మారెడ్డి



దెబ్బతిన్న ఉల్లి పంటను చూపిస్తున్న మహిళా రైతు

మండలంలోని జలదుర్గం, ఊటకొండ, గోపాల్‌నగరం, బావిపల్లి గ్రామాల్లో రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో ఉల్లిపంటను సాగుచేశారు. అక్టోబరు, నవంబరు మాసాల్లో ఎకరాకు రూ.70వేల నుంచి రూ.80వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట వేశారు. ప్రస్తుతం పంటకాలం పూర్తిఅయినా పలువురి రైతుల పొలాల్లో గడ్డలు ఏమాత్రం రాలేదు. ఏమి చేయాలో దిక్కుతోచక ఉల్లిరైతు గుండె కొట్టుకుంటున్నాడు.

వంద ఎకరాలకుపైగా పంటను తొలగించారు

మండలంలోని జలదుర్గంలో రైతులు ప్రధానంగా ఏటా నాలుగైదు వందల ఎకరాల్లో ఉల్లిని సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా అదే విస్తీర్ణంలో పంటను వేశారు. అయితే వివిధ తెగుళ్లతోనా లేక వాతావరణ మార్పు కారణం వలన దాదాపు 300 ఎకరాలకు పైగా పంట దెబ్బతిన్నది. దీంతో రైతులు వేరే పంటను వేసుకోవాలనే ఉద్దేశంతో రైతులు పంటను దున్నేస్తున్నారు. ఇప్పటికే వంద ఎకరాల్లో పంటను కొదరు రైతులు తొలగించారు. మరికొంత మంది దెబ్బతిన్న పంటను తొలగించడానికి సిద్ధపడుతున్నారు.

నాశిరకం విత్తనాలే రైతుల కొంప ముంచాయా?

జలదుర్గం గ్రామంలో దాదాపు 200 మంది రైతులు తమ పొలంలో ఉల్లి పంటను సాగు శారు. కర్నూలు, డోన్ నుంచి వివిధ రకాల కంపెనీల విత్తనాలను తెచ్చి పంటను వేశారు. అయితే కొంత మంది రైతులకు దిగుబడులు అడపదడప వచ్చినా.. అత్యధిక మంది రైతుల పొలాల్లో పంట నాశనమైంది. దీంతో నాశిరకం విత్తనాల వల్లనే పంట దెబ్బతినిందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులే దెబ్బతిన్న పంటను పరిశీలించి విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటను పరిశీలిస్తున్నాం

జలదుర్గం గ్రామంలో అధికంగా దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలిస్తున్నాం. పంట నాశిరకం విత్తనాల వల్లన లేక వాతావరణంలో మార్పులు రావడం వల్లన దెబ్బతిన్నదో గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. నాశిరకం విత్తనాలతోనే రైతుల పంటనష్టపోయాని తేలితే విత్తన వ్యాపారులపై తగు చర్యలు తీసుకుంటాము. అలాగే రైతుల తొందరపడి పంటను తొలగించవద్దని సూచించారు.

- కళ్యాణి, ఉద్యానవనశాఖ అధికారి, ప్యాపిలి

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు నివారణపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు వ్యాపారపరంగా ఆలోచించి పంటలను సాగు చేసి స్వయంప్రతిపత్తితో ఎదగాలని అన్నారు. కాలానుగుణంగా పంటలను సాగు చేయాలని, రైతులు ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా పండించిన దిగుబడులను విత్తనాలుగా తయారు చేసుకోవాలని అన్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌లో రాష్ట్రంలోనే నంద్యాల జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని అన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం నరేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో రంగనేతాజీ, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈవోలు మంజుల, ఫరూక్, జెడ్పీఎస్ఎఫ్ అధికారి జయనాగేశ్వర్‌రెడ్డి, వీహెచ్ఏలు, వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో మురళీకృష్ణ

భూమా ఆశయ సాధనకు కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి ఆశయ సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భర్త భార్గవ్‌రామ్‌తో కలిసి పట్టణంలోని భూమా ఘాట్‌లో తల్లిదండ్రులు భూమా శోభానాగిరెడ్డి, భూమా నాగిరెడ్డి సమాధుల వద్ద వారి చిత్రపటాలకు ఎమ్మెల్యే అఖిలప్రియ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ శిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, శేఖర్‌రెడ్డి, జాఫర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: దివంగత ఎంపీ, ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాలకు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. బుధవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో భూమానాగిరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే గొడిగనూరు గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కన్వీనర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమా నాగిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకులు సూరా రామ, ఉల్లి వెంకట సుబ్బయ్య, కమతం లక్ష్మీరెడ్డి, వెదుర్ల నాగేశ్వరరావు, కమతం పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల తదితర అన్ని గ్రామాల్లో భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో మద్దిలేటి, నాగేష్, హుసేనప్ప, రమేష్, కుందూరు నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దివంగత నంద్యాల ఎంపీ భూమా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో సిద్ధి సత్యం ఆధ్వర్యంలో భూమానాగిరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, సుబ్బరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, కుటుంబ సభ్యులు

తెలుగు సంస్కృతిలో సంక్రాంతి భాగం

- టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ
- ముందస్తు సంక్రాంతి వేడుకలు

బనగానపల్లె, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ తెలుగు సంస్కృతిలో ఓ భాగమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. బనగానపల్లె పట్టణంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించు కొని ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, మెహందీపోటీలు పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటాలు, హరిదాసులు, సంక్రాంతి లక్ష్మీ వేషాల్లో పిల్లల నృత్యాల మధ్య వేదికవద్దనుంచి ఊరేగింపుగా బయలుదేరి మైదానంలో ఏర్పాటు చేసిన భోగిమంటలను ముట్టించి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం పక్కీర్‌రెడ్డి, టంగుటూరు శ్రీనయ్య పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



భోగి మంటలను వెలిగిస్తున్న బీసీ ఇందిరమ్మ

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఆయా శాఖల ద్వారా సాధించిన ప్రగతి, సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు. సమావేశానికి జడ్పీటీసీ, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

'కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలి'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దళితుల భూములు కబ్జా చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మానియేల్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న విజయవాడలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్ కుమార్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు పెన్నం సుధాకర్, ప్రణయ్ కుమార్, ఓబులేసు, కిరణ్ కుమార్, నీతు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్మారక సభను విజయవంతం చేయాలి

శిరివెళ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న జరగనున్న ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

దొర్నిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వ్యవసాయాధికారి ప్రమీల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు ఉన్నారు.

పశుగ్రాసం పెంచుకోవాలి

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పశుగ్రాసం పెంపకం చేసుకొని పాడి పరిశ్రమ పెంపొందించుకోవాలని పశువైద్యాధికారి సాయిబాబా తెలిపారు. బుధవారం ఆర్‌బీకే కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుళ వార్షిక పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసుకొని రైతులు పశుగ్రాసం పెంచుకోవాలని తెలియజేశారు. పశుగ్రాసం విత్తనాలను రైతులకు అందజేస్తామన్నారు. పశువైద్య సిబ్బంది ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.13.15 లక్షలు

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన హుండీ లెక్కింపు ద్వారా రూ.13.15 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రమణ తెలిపారు. బుధవారం ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, భూపాల్‌రెడ్డి, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో కొలువుదీరిన సంతాన వేణుగోపాలస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సంతాన వేణుగోపాలస్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గీతాపారాయణం చేపట్టారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలి

కొలిమిగుండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించారు. బుధవారం సాయంత్రం అమరావతి నుంచి విద్యాశాఖ అధికారులు, జిల్లా, మండల కేంద్రాల్లోని విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి ప్రత్యేక ప్రణాళికతో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల హైస్కూల్ హెచ్‌ఎంలు కొలిమిగుండ్ల హుసేనయ్య, సుధాకర్‌గుప్త, సుజాత, సుబ్బలక్ష్మమ్మ, సంజీవరెడ్డి, లక్ష్మీసరోజ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోవెలకుంట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏవో నిరంజన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేవనూరు, ఉప్పలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేంద్రం రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పంటలకు సంబంధించిన సమస్యలు ఉంటే ఫొటోలు పెడితే అధికారులు సలహాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ప్రభాకర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పాతపేటలో మృ తి చెందిన ఐ.ప్రభాకర్ కుటుంబానికి రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ధర్మవరం నాగిరెడ్డి, ధర్మవరం గౌతమ్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ప్రభాకర్ స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధితకుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

కొలిమిగుండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో నెల రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులు ముగిశాయి. బుధవారం తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత ఆధ్వర్యంలో మీర్జాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా, మండల వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలకు వివిధ రకాల సమస్యలపై మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు బాలీశ్వరరెడ్డి వెల్లడించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సంజామల: మండల వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. మండలంలోని నట్లకొత్తూరు గ్రామంలో చివరి రెవెన్యూ సదస్సును తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన పలు వినతులను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, సర్వేయర్లు మల్లేశ్వరీ, క్రిష్ణయ్య, వి.ఆర్.ఒలు ఎరుకలయ్య సుబ్బరాయుడు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితిలోకి రావాలి

బనగానపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితిలోకి ఎదగాలని డోన్ డివిజన్ బీసీ సహాయ సంక్షేమ అధికారి ఓబులేసు సూచించారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌లో సంక్షేమ అధికారి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు.

ఒకరికి తీవ్ర గాయాలు

బేతంచెర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నుంచి నంద్యాలకు వెళ్లే మోటారు సైకిల్ డీవైడర్‌కు ఢీకొని వెల్దుర్తి మధు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, విజయ నాయక్‌కు స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని దుర్గాపేటలో నివాసముంటున్న వెల్దుర్తి మధు, విజయ నాయక్‌లు కలిసి తమ పని నిమిత్తం బేతంచెర్ల నుంచి నంద్యాలకు బైక్‌పై బయలుదేరారు. ప్రమాదవశాత్తు బైక్ డీవైడర్‌ను ఢీకొట్టడంతో మధు కుడి కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, విజయ నాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలు ప్రారంభం



స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఈవో

బేతంచెర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవారి క్షేత్రంలో బుధవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లెలమ్మ పండుగ

డోన్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో బుధవారం మల్లెలమ్మ పండుగ వేడుకలను గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పూజల్లో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పెద్దనాగిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, యువ నాయకులు గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

16న అప్రెంటిస్‌షిప్ మేళా

డోన్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 16న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి

పెద్దపప్పూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట అటవీప్రాంతంలో బుధవారం ట్రాక్టర్ కిందపడి వెంకటచరణ్‌రెడ్డి (25) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆయన కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి ట్రాక్టర్‌లో బండల లోడుతో ధర్మవరం వెళుతున్నారు. ముచ్చుకోట అటవీప్రాంతం రాగానే స్పీడ్ బ్రేకర్ రావడంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న లక్ష్మీరెడ్డి బ్రేక్ వేయడంతో ముందు భాగంలో కూర్చొన్న కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి కిందపడిపోయాడు. ఈ సమయంలో ట్రాక్టర్ అతడిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.